పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పదవీ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు వార్షిక జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాన్ని ఫైనాన్స్ డిపార్ట్మెంట్, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోగా సమర్పించాలని జిల్లా ఖజానా లెక్కల అధికారి ఎం.రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు తమ వార్షిక జీవనప్రమాణ ధ్రువీకరణ పత్రాన్ని జీవనప్రమాణ్ పోర్టల్లో కానీ, పింఛనర్ల వ్యక్తిగత సీఎఫ్ఎంఎస్ లాగిన్ ద్వారా కానీ, లేదా ఏదైనా ఖజానా కార్యాలయంలో కానీ సమర్పించవచ్చు అన్నారు. ఇందుకు పెన్షనర్ల ఆధార్, మొబైల్ నెంబర్ (ఓటీపీ కొరకు), పీపీవో నెంబరు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు సరిచూసుకోవలసి ఉంటుందని, ఫిబ్రవరి నెలాఖరు లోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకుంటే ఏప్రిల్1న ఇచ్చే మార్చినెల పెన్షన్ నిలిపి వేయబడుతుందని, ఉపఖజానా కార్యాలయాలలోగానీ పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించవచ్చు అన్నారు. సందేహాలుంటే ఖజానా కార్యాలయ అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

వైభవంగా వైకుంఠ ద్వార దర్శనాలు

- టీటీడీ ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టిటిడి ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతిష్టాత్మకమైన వైకుంఠ ద్వార దర్శనాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. శ్రీవారి దర్శనానంతరం భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. శ్రీవారి ఆలయం, బయటి క్యూలైన్లలో ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏర్పాట్లపై పలువురు భక్తులను అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ పర్వదినం సందర్భంగా టీటీడీ ప్రత్యేకంగా చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అద్భుతమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లతో వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయని చెప్పారు. టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ వేకువజామున 12.05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరిచిన అనంతరం అర్చకులు స్వామివారికి నిత్య కైంకర్యాలు నిర్వహించి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేశామన్నారు. తొలిమూడు రోజులు ఈ–డిప్ ద్వార టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే దర్శనం ఉంటుందని తెలిపారు. టోకెన్ లేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వదర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చుని చెప్పారు. టీటీడీ ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వార ఇచ్చే సూచనలను పాటిస్తూ దర్శన ప్రణాళికలను రూపొందించుకుంటే ఎలాంటి ఇబ్బందిలేకుండా స్వామివారిని దర్శించుకోవచ్చుని చెప్పారు. దాదాపు 3500 మంది పోలీసు, విజిలెన్స్ సిబ్బంది పగడ్బందీ ప్రణాళికలతో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తొలిమూడు రోజుల పాటు టోకెన్ కలిగిన భక్తులు నిర్దేశిత టైమ్ స్లాట్ ప్రకారం దర్శన క్యూలైన్లకు వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని తెలియజేశారు.

వైభవంగా స్వర్ణరథోత్సవం

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుమలలో స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 9 నుండి 10.30 గంటల నడుమ శ్రీవారి స్వర్ణరథోత్సవాన్ని పురమాడ వీధుల్లో నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ పర్వదినాన తిరుమల శ్రీవారి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు.

శ్రీవారి ఆలయంలో శోభాయమానంగా పుష్పాలంకరణ

శ్రీవారి ఆలయంలో ఏర్పాటుచేసిన పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. మహద్వారం నుంచి ధ్వజస్తంభం వరకు, వైకుంఠ ద్వారంలో సంప్రదాయం ఉట్టిపడేలా పలురకాల పండ్లు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలు, పత్రాలతో శోభాయమానంగా అలంకరణలు చేపట్టారు. వైకుంఠ ప్రదక్షిణ చేసే భక్తులకు గొప్ప అనుభూతి పొందేలా ముస్తాబు చేశారు. పది రోజుల పాటు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, నాలుగు టన్నుల కట్ ఫ్లవర్స్ అలంకరణలకు వినియోగించనున్నారు.

ఆకట్టుకున్న శ్రీరంగనాథస్వామి ఆలయ సెట్టింగు

శ్రీవారి ఆలయం వద్ద శ్రీరంగనాథస్వామి ఆలయ సెట్టింగు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో దాత సహకారంతో దీన్ని ఏర్పాటుచేశారు.

వైకుంఠ ద్వాదశినాడు చక్రస్నానం

వైకుంఠద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 4.30 నుండి 5.30 గంటల నడుమ శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నానమహోత్సవం వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా శ్రీస్వామి పుష్కరిణి తీర్థంలో చక్రస్నాన సుముహూర్తాన ఎవరైతే స్నానమాచరిస్తారో అటువంటి వారికి తిరుమల శేషగిరులలో వెలసివున్న 66 కోట్ల పుణ్యతీర్థ స్నానఫలం దక్కుతుందన్నది ప్రాశస్త్యం. కాగా వైకుంఠద్వాదశినాడు కూడా తిరుమల శ్రీవారి ఆలయంలో ఆర్జితసేవలను టిటిడి రద్దు చేసింది.

వైకుంఠ ద్వార దర్శనానికి క్యూకట్టిన ప్రముఖులు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సామాన్య భక్తుల దగ్గరి నుంచి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ సెలబ్రిటీలు, టీం ఇండియా క్రికెటర్లు తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్ ఆలయాలకు క్యూ కట్టారు. ముఖ్యంగా తెలుగు మూవీ స్టార్స్ శ్రీలీల, శివాజీ, మెగా స్టార్ ఫ్యామిలీ నుంచి చిరంజీవి సతీమణి సురేఖ, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నారా రోహిత్ జంట, మాజీ మంత్రి రోజా, ఓజీ నిర్మాత దానయ్య, నటి హేమ, బండ్ల గణేశ్ ఇలా అనేక మంది వేకువ జామునే తిరుమల శ్రీవారిని ఉత్తర ద్వారం గుండా దర్శణం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. అయితే.. శ్రీలీల స్వామి వారి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లిపోతున్న క్రమంలో అభిమానుల తాకిడి ఒక్కసారిగా ఎక్కువయింది. వెంటే సెక్యూరిటీ గార్డ్స్ ఉండి పబ్లిక్‌ను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ చాలామంది ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

టీటీడీ చైర్మన్ బిఆర్.నాయుడు ఆకస్మిక పరిశీలనలు

శ్రీవారి ఆలయ ఆవరణలో భక్తులతో మమేకమై సౌకర్యాలు, సదుపాయాలపై ఆరా తీసిన చైర్మన్ బిఆర్ నాయుడు వైకుంఠద్వార దర్శనం పూర్తి చేసుకొని ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులతో దర్శన ఏర్పాట్లు ఎలా ఉన్నాయని అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లలో మంచినీళ్లు, పాలు, అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందిస్తున్నారని భక్తులుసంతోషం వ్యక్తం చేశారు. నాదనీరాజనం వేదికపై కళాకారులు నృత్య ప్రదర్శనలను, శ్రీ రంగనాథస్వామి ఆలయ సెట్టింగును తిలకించారు. చైర్మన్‌తో సహా పరిశీలనలో బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, జానకీదేవి, నరేష్, శాంతారాం పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

పకడ్బందీగా యూరియా పంపిణీ: కలెక్టర్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

యూరియా సమృద్ధిగా లభ్యమవుతుందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మంగళారం స్థానిక కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వ్యవసాయ అధికారులతో జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, యూరియాను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిత్తూరు జిల్లాలో రబీ 2025 – 26 గాను, పంటలకు అవసరమైన 20183 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయడమైనదని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో మొత్తం 5747 మెట్రిక్ టన్నుల అవసరం కాగా, ఇప్పటికే 6753 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. డిసెంబర్ ఆఖరికి ఇంకా 500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నదని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 4712 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం 1558 మెట్రిక్ టన్నుల యూరియాను ఆర్ఎస్‌కెలలో, మార్కెట్ గోదాములలో, రిటైల్, హోల్ సేల్, కో ఆపరేటివ్ సొసైటీలలో కంపెనీ గోదాములలో ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని, దేశీయంగా ఉన్న అన్ని ఎరువుల కర్మాగారాలు ఉత్పత్తి చేయుచున్నదని తెలిపారు. అలాగే విదేశాల నుండి కూడా అవసరమైన యూరియా దిగుమతులు సంతృప్తికరంగా ఉన్నవన్నారు. కనుక రాబోయే పంట కాలంలో కూడా యూరియాకు ఎటువంటి కొరత లేకుండా చూసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులు ఎరువులను కొనుగోలు చేయునప్పుడు బస్తాపై ముద్రించిన ఎం.ఆర్.పి ధరలను చూసుకుని, దాని ప్రకారం చెల్లించి, తప్పని సరిగా డీలరు నుండి రసీదు పొంద వలసినదిగా ఆదేశించారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపుచేసిన, ఎంఆర్‌పి ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించిన వారి లైసెన్సులు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సీనియర్ ఆఫీసర్లు తరచూ ఆర్ఎస్‌కెలను సందర్శించి 15 రోజుల్లో నివేదికను సమర్పించాలన్నారు. యూరియా ఒకచోట నుండి ఇంకోచోటకి స్టాక్ ఎప్పుడు వస్తుందని ఎప్పుడు పంపిణీ చేయడం జరుగుతుందో వాటి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి ప్రతికూల వార్తలు వస్తున్నాయని వాటిని పరిశీలించి పరిష్కరించాలన్నారు. అన్ని మండలాల వ్యవసాయ అధికారులు వారికి ఎంత యూరియా అవసరమో కలెక్టర్‌కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కుప్పం: తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్ పర్సన్ శాంతా నాగరాజ్ తెలిపారు. బీసీఏలో ఉష (9.41 పాయింట్స్), కావ్య శ్రీ (9.31), బీకాం సిఏలో దివ్య (8.96), శ్వేత (8.94), బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో లోకేష్ (8.36), పూర్ణిమ (8.28), బీబీఏలో ఇందు శ్రీ (8.03) పవిత్ర (7.93) బిఎస్సిలో నవిత (7.34) పలని 7.08 పాయింట్లు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎవరెస్ట్ బేస్ క్యాంపుకు రొంపిచర్ల విద్యార్థి

ప్రజాశక్తి - రొంపిచర్ల: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఎవరెస్ట్ బేస్ క్యాంపుకు రొంపిచర్ల ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి విక్రాంత్ ఎంపికైనట్లు ఎంఈఓ డి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తిరుపతిలో జరిగిన జోనల్ లెవెల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి విద్యార్థి ఎంపిక అయ్యాడని తెలిపారు. రొంపిచర్ల బీసీ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న విక్రాంత్ ఎంపికకు కృషిచేసిన భవిత పాఠశాల ఉపాధ్యాయులు అమ్ములు, మానసను అభినందించారు. త్వరలో విజయవాడలో జరిగే ఎవరెస్ట్ బేస్ క్యాంపులో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే, టిడిపి అధ్యక్షులు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన 'సూపర్ సిక్స్' పథకాలు సూపర్ హిట్‌గా నిలిచాయని, ఎన్నికల హామీలను అమలు చేశామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, టిడిపి నూతనఅధ్యక్షుడు షణ్ముఖ రెడ్డి చెప్పారు. మంగళవారం చిత్తూరులోని హోటల్లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గురుజాల, షణ్ముఖ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, మోహన్ రాజ్, రాజేష్ కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 2025లో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విజయాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం పథకాలను అమలు చేసిందని, గ్రామీణ పట్టణప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఊపందుకున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషి ఫలితంగా రాష్ట్రంలోకి భారీగా పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని, గత ప్రభుత్వ హాయంలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను కూటమి ప్రభుత్వం తిరిగి తెచ్చిందన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రభుత్వం నిర్దేశించిన ధరలతో నిబంధనలు మేరకే ఎరువులను విక్రయించాలని అతిక్రమించిన చర్యలు తీసుకుంటామని ఏడిఏ సాలురెడ్డి ఎరువుల దుకాణదారులకు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ప్రత్యేక అధికారులు సాలురెడ్డి, అగ్రికల్చర్ అధికారి సునీల్ రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను, ధరల పట్టికను తనిఖీ చేసి, నిర్ణీత గడువున్న మందులను, ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలతోనే విక్రయించాలని దుకాణదారుడుకి సూచించారు. రైతులకు అవసరమైన యూరియాతోపాటు అన్ని ఎరువులను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రైవేట్ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించిన ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ అమ్మిన చర్యలు తీసుకుంటామని తనిఖీ అధికారులు హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారిణి హేమలత పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



డిసెంబర్ 31 రాత్రి చిత్తూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా రోడ్ల వద్ద చెక్‌పోస్టులు, పికెట్‌లను ఏర్పాటు చేసి రాత్రి 10 గంటల నుండి వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించి తెల్లవారు జామున వరకు కొనసాగించబడుతుందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. వైన్ షాపులు, బార్‌లను ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు. చిత్తూరు పట్టణంలోని ప్రధాన రోడ్లు, ఫ్లైఓవర్‌లపై నూతన సంవత్సర వేడుకలు నిషిద్ధమని, స్పెషల్ డ్రైవ్‌లో బ్రీత్ అనలైజర్ ద్వారా పట్టుబడిన వ్యక్తులను మేజిస్ట్రేట్ ముందుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపుతామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేట్ స్థలాల నిర్వాహకులు ముందుగానే అనుమతి పొందాలని, అనుమతి లేకుండా నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పన్నారు. వేడుకల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, బాణసంచా, పేలుడు పదార్థాలకు అనుమతి లేదని, బహిరంగ మద్యపానం, ట్రిపుల్ రైడింగ్ పూర్తిగా నిషేధమని, మద్యం తాగి వాహనం నడిపినట్లయితే చట్టం ప్రకారం రూ.10,000 జరిమానా, 6 నెలల జైలు శిక్ష లేదా లైసెన్స్ రద్దు జరుగుతుందన్నారు. మైనర్లు వాహనం నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా మద్యం మత్తులో అత్యుత్సాహం ప్రదర్శించి పబ్లిక్ ఆస్తులు, ఇతరులకు సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేస్తే వారి పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యంతకరమైన అంశాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపై ఎటువంటి కేక్ కటింగ్‌కు అనుమతి లేదని కేక్ కటింగ్ చేయాలనుకునే వారు తమ తమ ఇళ్లలోనే వారి కుటుంబ సభ్యులతో వేడుకలు చేసుకోవాలన్నారు. ప్రజల రక్షణార్థం డిసెంబర్ 31 రాత్రి అంతా బ్లూ కోట్, రక్షక్ టీంలు రాత్రిళ్ళు గస్తీ నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్సైజ్, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరిగా పాటించాలని, వీటిని అమలు చేయడంలో సహకరించి నూతన సంవత్సరాన్ని అందరూ ప్రశాంతంగా జరుపుకుందామని అన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగిన డయల్ 112, పోలీస్ స్టేషన్‌కు, 9440900005కు ఫోన్ చేయాలని తెలిపారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు

పూతలపట్టులో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొన్నా ఎమ్మెల్యేలు, కలెక్టర్

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో నలుగురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ముందుగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చూడ ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు మాజీ మార్కెట్ చైర్మన్ చంద్ర ప్రకాష్ స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకార అందించడానికి ఎల్లప్పుడు ముందుంటామని హామీ ఇచ్చారు. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించి వైకుంఠ ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు, చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి గోపి, వసంత్ కుమార్ పాల్గొన్నారు.

గంగవరం: మండలం కీలపట్ల పంచాయతీలు నెలకొన్న శ్రీకోనేటిరాజస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం ఆలయంలో వేకుజములోని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది.

సోమల: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కమ్మపల్లి, ఆవులపల్లి, బురుజుపల్లి, మిట్టపల్లి, నెల్లిమంద, చింతలవారిపల్లి గ్రామాలలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలల్లో పూజా కార్యక్రమాలు, ఉత్తర ద్వార దర్శన భాగ్యాన్ని భక్తులకు నిర్వాహకులు అందజేశారు. మిట్టపల్లి, కమ్మపల్లి, చింతలవారిపల్లి గ్రామాలలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ట్రస్ట్ కెఎస్.వాసు భక్తులకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో టీటీడీ అనుబంధ ఆలయం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాటకు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. మధ్యాహ్నం ఆర్కేవీబీ పేటకు చెందిన కొడివలస వెంకటస్వామిరెడ్డి జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ అధికారి సురేష్ కుమార్, అర్చకులు రమేష్, పలువురు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: ముక్కోటి ఏకాదశి పండుగను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రమైన రామకుప్పంలోని సుబ్రహ్మణ్యస్వామి, పద్మావతి, వెంకటేశ్వర స్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి, విజలాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం తో పాటు గ్రామాల్లోని పలు దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, పెద్ద ఎత్తున అన్న ప్రసాదాలు పంచిపెట్టారు.

విజయపురం (నగరి) : మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వైకుంఠ ద్వారం నుంచి వచ్చి శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యసామిని దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పలువురు భక్తులు ఆలయం వెలుపల అన్నదానం చేశారు.

పలమనేరు: పలమనేరులోని పలు దేవాలయాలలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగింది. గంగమ్మ గుడివీధిలోని శ్రీ భూనీలా కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, కొలమాసనపల్లిలో వెలసియుండు శ్రీలక్ష్మీ చల్వరాయ స్వామి దేవాలయం, మన్నార్ నాయనపల్లి వద్ద గల విష్ణుపురిలో వెలసిన శ్రీ నిర్వాణ నారాయణస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడంతో భక్తులతో కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వివరణ కార్యక్రమం జరిగింది.

బంగారుపాళ్యం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని సీతారాముల గ్రామోత్సవ కార్యక్రమం మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలో మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. మండలంలోని నల్లగాంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఇచ్చిన హామీలు అమలు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -కుప్పం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతుందని, వైసిపి అరాచక పాలన నుండి అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం టిడిపి కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటిని అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా అమలు చేయడం జరుగుతుందని, ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంలో లబ్ధి జరుగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు అదనంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఏడు పరిశ్రమలకు ఒకేరోజు శంకుస్థాపన చేయడం జరిగిందని నియోజకవర్గంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా సీఎం ముందుకు సాగుతున్నారన్నారు. కుప్పం ప్రాంత చిరకాల వాంఛ అయిన హంద్రీనీవా జలాలను కుప్పంకు తీసుకువచ్చి ఇక్కడ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. నియోజకవర్గంలో కనివిని ఎరగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతోందని రాజకీయాలకతీతంగా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వైసీపీ వాళ్ల యధా రాజా తధా నాయక అన్న తరహాలో ప్రవర్తిస్తున్నారని పద్ధతి మారకపోతే తగు రీతిలో గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసిన వైసిపి విధ్వంస ప్రవర్తన ఆగడం లేదని ఇలానే కొనసాగితే కనీసం గ్రామాల్లో కూడా ప్రజలు అడుగుపెట్టనీయరని హెచ్చరించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, ఏపీ ఈడబ్ల్యూడిసి చైర్మన్ రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కాణిపాకం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు వసంతమ్మ, మున్సిపల్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షులు రాజగోపాల్, మునివెంకటప్ప పాల్గొన్నారు.

స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలి: ఎమ్మెల్యే



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పూతలపట్టు: ఎస్టీలు వలసలు పోకుండా స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంగళవారం రంగంపేట క్రాస్‌లోని గువ్వల కాలనీలో 20 మందికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాలనీలో ఏర్పాటుచేసిన ఉచితవైద్య శిబిరాన్ని ఇరువురు పరిశీలించారు. నివాస గృహాలు చుట్టూ పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది నిరంతరం కాలనీపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు, మురళి నాయుడు పాల్గొన్నారు.

రీసర్వేని సద్వినియోగం చేసుకోండి: తహశీల్దార్

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ లోకనాథ్ పిళ్లై అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే ఫేజ్ 4కు సంబంధించి మండలంలోని వెంకటాపురం, వేణుగోపాలపురం, మంగుంట గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ సంబంధిత రెవెన్యూ పరిధిలో గల రైతులు రీసర్వే సహకరించి సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులను కోరారు.

మదనపల్లి జిల్లా ఏర్పాటు స్వాగతిస్తూ సంబరాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్లలో అన్నమయ్య జిల్లాను స్వాగతిస్తూ మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ బాబుకు పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. చల్లా బాబు రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసి మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేసి పుంగనూరు నియోజకవర్గంలోని ఒక మున్సిపాలిటీ నాలుగు మండలాలను అన్నమయ్య జిల్లాలోకి విలీనం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కేక్‌కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. మండల పార్టీ అధ్యక్షులు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, నాయకులు ఓబులేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఓంశక్తి భక్తులకు ఉచిత బస్సు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 12వ వార్డు కనికాపురం, మాపాక్షి, గుడిపాల మండలం పానాటూరు, గుడిపాల గ్రామాలకు చెందిన ఓంశక్తి మాలధారణ భక్తులు మేల్మరువత్తూరు వెళ్లి రావడానికి 'జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఉచిత బస్సును ఏర్పాటు చేశారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు ఆలయంలో పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం ఈ బస్సు యాత్రను స్థానిక ఉమ్మడి పార్టీల నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. యాత్రకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న చైర్మన్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంస్థ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కరెంటోళ్ళ జనబాట

ప్రజాశక్తి - సోమల: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే కరెంటోళ్ళ జన బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో మహేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లిమంద పంచాయతీ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ శాఖ సిబ్బంది పర్యటించి గ్రామాలలో వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ఒక విద్యుత్ స్తంభం నుండి మరొక విద్యుత్ స్తంభంకు ఉండే వైర్లు అతి తక్కువ ఎత్తులో ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో వాటిని అప్పటికప్పుడే పరిష్కరించామని, అదనపు లోడు రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు 50 కిలోవాట్ల అదనపు లోడు కోసం వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గ్రామాలలో వైర్లకు అక్రమ కనెక్షన్లు తగిలించడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ ఉంటుందని ప్రజలు కట్టింగా సర్వీస్ వైర్లు తెచ్చుకొని విద్యుత్ స్తంభం నుండి ఇంటి వరకు వైర్లు బిగించుకోవాలని కోరినట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతీ వేణుగోపాలపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో అవగాహన సదస్సును జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వలన వాతావరణం మొత్తం కలుషితమైదని, దానికి అనుగుణంగా ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారుల సలహాలను రైతులు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం దిశగా ముందుకు వెళ్లాలని కోరారు. మండల వ్యవసాయ అధికారిని వనిత, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ మురళి, ట్రైనింగ్ ఐసిఆర్‌పి రేష్మ మార్కెటింగ్ చైర్మన్ రవి, సర్పంచ్ చిన్నస్వామి పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో చేర్చే వరకు పోరాటం ఆగదు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపేంత వరకు తమ పోరాటం ఆగదని అఖిలపక్ష నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గాండ్ల మిట్ట కూడలీలో అఖిలపక్ష నాయకులు శాంతియుత నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపే బాధ్యత టీడీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే తీసుకుంటుందని హామీ ఇచ్చారని, నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా టీడీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే హామీలను చంద్రబాబు నెరవేరస్తాని అన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గాలు పునర్విభజన జరుగుతున్నప్పటికీ ఈ రెండు మండలాలను తిరుపతి జిల్లాలో కలుతామన్న హామీని ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే పోరాటం ఆగబోదని, ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ప్రసాద్ రెడ్డి, సుబ్రమణ్యంరాజు, గౌతంరాజు, శివలింగం, పయణి పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని గుంతూరు గ్రామంలో ఆలయానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు విన్నవించగా మంగళవారం స్పందించిన తహశీల్దార్ షబ్బీర్ బాష క్షేత్రస్థాయిలో గ్రామాన్ని పరిశీలించి గ్రామంలోని 5 సెంట్ల స్థలం రహదారిని సర్వే చేపట్టి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించారు. టిడిపి యువనాయకులు భాష్యం వంశీ చౌదరి, మండల సర్వేయర్ లావణ్య, వీఆర్వో వెంకటేష్, సర్వేయర్ సారధి, యూనిట్ ఇంచార్జి సుదర్శన్ నాయుడు పాల్గొన్నారు.

మదనపల్లి జిల్లాగా ఉండాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి- పుంగనూరు: 50 సంవత్సరాలుగా మదనపల్లి పేరుగా కొనసాగుతున్న దానిని జిల్లా పేరుతో అన్నమయ్యగా మార్చడం సరికాదని మదనపల్లి జిల్లాగానే ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సజ్జాద్ బాష మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హామీలు భాగంగా మదనపల్లి జిల్లా అని ప్రకటించినారని మళ్లీ అన్నమయ్య జిల్లాలోనే జిల్లా కేంద్రంగా మదనపల్లి చేశారని దీంతో ఈప్రాంత ప్రజలు నిరాశకు లోనయ్యారని తెలిపారు.

చురుగ్గా అంబేద్కర్ అతిథిగృహం పనులు

ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ అతిథి గృహ నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. స్థానిక అంబేద్కర్ భవన ఆవరణలో నిర్మిస్తున్న అంబేద్కర్ అతిథి గృహంను చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డి నిధులు రూ.20లక్షలతో నిర్మిస్తున్న అంబేద్కర్ అతిథి గృహపనులు చురుగ్గా జరుగుతున్నాయి. అంబేద్కర్ విగ్రహం, అంబేద్కర్ భవనం, అంబేద్కర్ గెస్ట్‌హౌస్‌తో పాటు అంబేద్కర్ సర్కిల్‌ను ఏర్పాటు చేసి దళితులకు అగ్రస్థానం కల్పించిన వైసిపి పెద్దిరెడ్డి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, మున్సిపల్ డీఈ మహేష్, కాంట్రాక్టర్ మునిరెడ్డి పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం

ప్రజాశక్తి - సోమల: మండలంలోని అన్ని పంచాయతీలలో 31వ తేదీ బుధవారం ఉదయం 7 గంటల నుండి పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో సివిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. సచివాలయ సిబ్బంది కేటాయించిన ఉద్యోగులు 7 గంటల నుండి వృద్ధులు, వికలాంగులు, వితంతులకి పింఛన్ల పంపిణీ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరు పింఛన్లు తీసుకోవాలని కోరారు. జనవరి నెల పింఛను ఒకరోజు ముందుగానే 31వ తేదీనే అందజేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి: ఏఈ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: విద్యుత్తు పొదుపుగా వాడుకోవాలని అవలకొండ విద్యుత్ శాఖ ఏఈ తనిగవేలు ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా లూజుగా ఉన్న లైన్లను సర్దుబాటు చేయడం, చెట్లను నరికి వేయడం, దెబ్బతిన్న స్తంభాలు, దెబ్బతిన్న కేబుల్స్, చిన్న స్తంభాలను గుర్తించడం, వంటి కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, ఎల్ఎంలు సుబ్రహ్మణ్యం, గజేంద్ర, గురుమూర్తి, టిడిపి నాయకులు ఫిరోజ్ అలీ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపీటీఎఫ్ చిత్తూరు జిల్లా శాఖ మంగళవారం నూతన సంవత్సరం సందర్భంగా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం డీఈవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు పల్లేరు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి ప్రభాకర్, సీనియర్ నాయకులు గోపీనాథ్, ముక్తార్ అహమ్మద్, అమర్నాథరెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, జెడ్ఎస్ఎస్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, అఫ్జల్ బాషా పాల్గొన్నారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- యాదమరి: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిత్తూరు జిల్లా శాఖ రూపొందించిన 2026 సంవత్సరం క్యాలెండర్‌ను కే.గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ ప్రధానోపాధ్యాయులు లలిత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల విద్యాశాఖ 10వ తరగతి విద్యార్థుల కొరకు ప్రవేశపెట్టిన 100 రోజుల కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ఎస్టియు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, మండలశాఖ ప్రధాన కార్యదర్శి రంగనాథం, జిల్లా ఉపాధ్యక్షులు సుల్తాన్, కన్వీనర్ నాగభూషణం, పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, మధుబాబు, దామోదర్ రెడ్డి, చిన్న దొర్రై, షణ్ముగం, మహేష్, సుధాకర్, చిట్టిబాబు, రాజా పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీగా నరసింహులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: రాజంపేట మండలం గ్రామపంచాయతీ రోల్లమడుగులో గ్రేడ్ 3గా విధులు నిర్వహించిన నరసింహులు పంచాయతీ సెక్రటరీకి గ్రేడ్ 2కి ప్రమోషన్ పొందారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి మండలంలో పంచాయతీ సెక్రటరీగా మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నరసింహులుకు తహశీల్దార్, ఎంపీడీవో, మండలస్థాయి అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పుంగనూరులో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి- పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని పుంగనూరును మదనపల్లి, అన్నమయ్య జిల్లాలో చేరుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంతో హర్షించదగ్గ విషయమని నాయకులు సివిరెడ్డి, మాధవరెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో కూటమి నాయకుల ఫ్లెక్సీలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఏ సమస్య నైనా అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారని, పేదల సమస్యల పరిష్కారంలో రాజకీయాలు చేయవలసిన అవసరం కూటమి ప్రభుత్వానికి లేదన్న సంగతి ప్రతిపక్ష పార్టీ నేతలు గుర్తించుకోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ సమీపత్ యాదవ్, విశ్రాంత డిఎస్పి సుకుమార్, న్యాయవాది వెంకటముని యాదవ్, గిరి, ఇబ్రహీం, షామీర్ బాష పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలపై పోలీసు ఆంక్షలు

ప్రజాశక్తితో కుప్పం డిఎస్‌పి పార్థసారధి

ప్రజాశక్తి -కుప్పం: నూతన సంవత్సర వేడుకలను ఆనంద ఉత్సవాల మధ్య జరుపుకోవాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కుప్పం డిఎస్‌పి పార్థసారథి, అర్బన్ సీఐ శంకరయ్య పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలపై పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్, డీజేలు, బాణాసంచా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మత్తు పదార్థాల వాడకంపై కఠిన ఆంక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత శాంతిభద్రల పరిరక్షణ దృష్ట్యా నూతన సంవత్సరం సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో ఆంక్షలుతో కూడిన భద్రతా చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్, డాన్సులు, పార్టీలు, రంగులు చల్లడం, టపాకాయలు కాల్చడం వంటి వాటిని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్‌కు సంబంధించి కల్చరల్ ప్రోగ్రామ్స్‌కు ఎక్కడ అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం నుండి జనవరి ఒకటో తేదీ ఉదయం వరకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత తొందరపాటు చర్యలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి పండుగలా ఉండాలి కానీ విషాదానికి దారి తీయకూడదన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం జరావారిపల్లి పంచాయతీ జంగాలపల్లిలో గత మూడు నెలలుగా తాగునీటి సమస్య ఉందని, ఇప్పటి వరకు పరిష్కారం చూపలేదని మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానిక సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శి పలుమార్లు తెలియజేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపాన ఉన్న కౌండిన్య నది నుంచి నీటిని తీసుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నది నీరు సైతం సమీపంలోని డెయిరీ నుంచి కలుషిత నీరు చేరడంతో నీరు రంగుమారి దుర్వాసన వస్తున్నాయని విధి లేని పరిస్థితుల్లో వాటిని ఉపయోగిస్తున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని ప్రభుత్వ బాలుర వసతిగృహ సంక్షేమ అధికారికె. సోమసుందర్ రెడ్డి ఉద్యోగవిరమణ చేయనున్నారు. గత 35 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసి ఆయన అనేకమంది విద్యార్థులను సంరక్షించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను జిల్లా కలెక్టరు వారిచే 13సార్లు ఉత్తమ వసతి గృహ సంక్షేమ అధికారిగా అవార్డులు పొందారు. 31వ తేదీ బుధవారం ఉద్యోగ విరమణ చేయుచున్నారు. ఈసందర్భంగా ఆయన జీవిత విశేషాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం కలగటూరు గ్రామంలో కుళ్ళారెడ్డిగారి వెంకటరెడ్డి, తిమ్మక్కల ఏకైక పుత్రుడు కె.సోమసుందర రెడ్డి. ఇతను 1963 సంవత్సరంలో డిసెంబర్ 22వ తేదీన కలగటూర్‌లో జన్మించాడు. ఇతని విద్యాభ్యాసం కలగటూరు, ప్రాథమిక పాఠశాల, కల్లుపల్లి ఉన్నత పాఠశాల, పలమనేరు జూనియర్ కళాశాల, తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలలో బీఎస్సీ, ఎంఎస్సీ చదువుకున్నాడు. అనంతరం బీఈడీ, డిసి అండ్ ఎఫ్‌పి కోర్సులను పూర్తి చేశాడు. చిన్నప్పటి నుంచి కష్టపడి ఉన్నత విద్యలు చదివి, మొట్టమొదట 28.8.1991లో చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లిలో వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్లో వార్డెన్‌గా చేరి ఎక్కువ కాలం పనిచేశాడు. 19.8.1992లో చిత్తూరు జిల్లా కల్లూరులో గల శాంతమ్మ, రామచంద్రా రెడ్డిల మొదటి పుత్రిక పద్మజను వివాహం చేసుకున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులు నాగ ధీరజ్ రెడ్డి, గురుచరణ్ రెడ్డి. ఇద్దరూ బీటెక్ చదివి సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. 19.5.2021లో ప్రమోషన్ పొంది బైరెడ్డిపల్లి నుండి పలమనేరు వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్లో గ్రేడ్ వన్ వార్డెన్‌గా పనిచేస్తూ ఎన్నో అవార్డులు, రివార్డులు పొంది, హాస్టల్ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉన్నతాధికారులతో సంప్రదించి సౌకర్యాలు ఏర్పాటు చేసి, మన్ననలు పొందిన కే.సోమ సుందర్‌రెడ్డి 31న ఉద్యోగ విరమణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా పలువురు అతనికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేయుచున్నారు.

ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది: ఎంఈవో

ప్రజాశక్తి- యాదమరి: ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదని మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి తెలిపారు. మంగళవారం కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం లలిత ఆధ్వర్యంలో ఎంఈవోను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో రుక్మిణమ్మ చేసిన సేవలను కొనియాడారు. ఎంఈవో మాట్లాడుతూ యాదమరి మండలంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేయడంలో ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదని, మండలంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు చూపిన ఆదరాభిమానాలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ చిత్తశుద్ధితో కృషిచేసి విద్యార్థులను ఉత్తమం పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఉపాధ్యాయులు సుల్తాన్, భాస్కర్‌రెడ్డి, కనకాచారి, మదన్ మోహన్‌రెడ్డి, మధుబాబు, దామోదర్‌రెడ్డి, చిట్టిబాబు, నాగభూషణం, సుధాకర్, మహేష్, చిన్నదొరై పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని ఎన్ఆర్‌కండ్రిగ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు జె. దిల్లి బాబు తన అవసర నిమిత్తం చిత్తూరులోని చోళ ఫైనాన్స్ వారి దగ్గర సుమారు రూ.4,65,000లు లోన్ తీసుకున్నాడు. అదేవిధంగా కొంతమంది వ్యక్తుల దగ్గర రూ.4లక్షలు అప్పు తీసుకొని వాటిని తీర్చుకోలేకపోయాడు. సదురు ఫైనాన్స్ కంపెనీకి సంబంధించి ఒక ఎన్ఐ యాక్ట్ బెయిలబుల్ వారెంట్ కూడా చనిపోయిన వ్యక్తి అతని భార్య పేరు మీదుగా వచ్చి ఉంది. తన ఆర్థిక ఇబ్బందులు, అప్పులు కారణంగా మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. అంతేకాకుండా తనకున్న నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ నరకయాతన అనుభవించేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి పైకప్పుకు అమర్చిన కొక్కెంకి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం గుర్తించిన మృతుని భార్య డి.ఉష పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీ కొని యువకుడు మృతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని ఏడుగట్లు గ్రామంలో కేశవరాజకుప్పం మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరువళ్లూరు జిల్లా, పళ్లిపట్టు తాలుకా గొల్లాల కుప్పంకు చెందిన చెంచుగాన్ (29) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చెంచుగాన్ తమిళనాడు పొన్‌పాడిలోని ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య చాముండేశ్వరి తిరుపతిలోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తూ అమ్మగారి ఇంట్లో ఉంటోంది. నూతన సంవత్సర వేడుకలను తిరుపతికి వెళ్లి భార్యతో కలిసి జరుపుకునేందుకు అవసరమైన సరకులు తీసుకొని మంగళవారం యదావిధిగా కంపెనీకి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. పని ముగించుకొని తిరుపతికి వెళుతున్నట్లు తల్లికి చెప్పి వచ్చాడు. మార్గమధ్యంలో కేశవరాజకుప్పం మలుపు వద్ద టిప్పర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. టిప్పర్ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో చెంచుగాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ పరారయ్యాడు. కాగా చెంచుగాన్‌కు పిల్లలు లేరు. తల్లిదండ్రులకు చెంచుగాన్ ఒక్కగానొక్క కుమారుడు, కుటుంబానికి అతనే ఆధారం. కొడుకు మరణవార్తవిని సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లితండ్రులు మృతదేహాన్ని చూసి కుమిలిపోయారు. వారితో పాటు వచ్చిన బంధువులు ప్రమాదానికి కారణం తెలుసుకొని ఆగ్రహానికి లోనయ్యారు. డ్రైవర్ పరారి కావడంతో ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో తమకు న్యాయం జరిగేంతవరకు అక్కడ నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు.

కరెంట్ షాక్‌తో పాడి ఆవు మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గడ్డూరు గ్రామంలో 11 కెవి విద్యుత్ లైన్ తెగిపడటంతో కరెంట్‌షాక్‌తో పాడి ఆవు మృతిచెందింది. పాడి రైతు సి. రాజేంద్ర ఆవును షెడ్డులో సోమవారం రాత్రి కట్టేసి ఉండగా విద్యుత్ లైన్ తెగిపడటంతో కరెంట్ షాక్ తగిలి పాడి ఆవు అక్కడిక్కడే మృతి చెందింది. రూ.1,30,000లు విలువ జేసే ఆవును కోల్పోయామని, తమ కుటుంబ జీవనాధారమైన ఆవు మరణించడంతో నష్టపోయామని, తమను ఆదుకోవాలని రాజేంద్ర విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో తరచూ విద్యుత్ లైన్లు తెగిపోతున్నాయని, పలుమార్లు కరెంట్‌షాక్‌తో ప్రమాదాల భారిన ఘటనలు ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులు ఇకనైనా స్పందించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి: డీఎస్పీ

ప్రజాశక్తి- కుప్పం: సురక్షిత ప్రయాణానికి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కుప్పం డిఎస్పి పార్థసారధి, అర్బన్ సీఐ శంకరయ్య పేర్కొన్నారు. శాంతిపురంకు చెందిన గ్రేస్ మరయా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కుప్పం పట్టణంలో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగా ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఉన్న ప్రేమతో లక్ష రూపాయలు పెట్టి ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తున్నారని అయితే వాహనదారులు హెల్మెట్ వాడకుండా చూపే నిర్లక్ష్యం తల్లిదండ్రులకు తీరని కన్నీళ్లు మిగులుస్తున్నాయన్నారు. తలకు తీవ్రగాయాలు పాలై గోల్డెన్ అవర్స్‌లో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- సోమల: కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా గిరిజనుల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని మండలంలోని గిరిజనుల కాలనీలలో మౌలిక వసతులు సమస్యల పరిష్కారం కోసం తాము ఎప్పుడు ముందు వరుసలో ఉంటామని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు అన్నారు. మంగళవారం ఇరికిపెంట పంచాయతీ గువ్వల గుట్ట గ్రామంలో గిరిజన వికాసం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల కలెక్టర్ పర్యటించి వారికి కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇంటి పట్టాలు వ్యవసాయ యోగ్యమైన భూమి ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని వారి ఆదేశానుసారం పలువురికి ధ్రువపత్రాలను వ్యవసాయ యోగ్యమైన భూమి సర్వే చేసి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, తహశీల్దార్ మధుసూదన్, వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్ఏ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాదమరి: గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ పత్తిపాటి భగవతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఓటివారిపల్లి గ్రామపంచాయతీలో గిరిజన వికాసం పథకంలో భాగంగా గిరిజనల ఆరోగ్యం సంక్షేమం లక్ష్యంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె చెప్పారు. ఓటివారిపల్లె ఎస్టీ కాలనీలో గ్యాస్ కనెక్షన్ లేని లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌ను పంపిణీ చేశారు. తహశీల్దార్ పార్థసారధి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు అన్ని సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పరిపాలన సాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మాదిరెడ్డిపల్లి పిహెచ్‌సి డాక్టర్ వరప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ ఏవో వేణు, వీఆర్వో శ్రీనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శైలజ, స్వర్ణలత, వెల్ఫేర్ అసిస్టెంట్ కవిత, అంగన్వాడీ సూపర్వైజర్ సరళ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల గ్రామపంచాయతీ తిమ్మయ్యగారిపల్లి ఎస్టీ కాలనీలో మండల పరిషత్ పరిపాలనాధికారి ఆనందబాబు ఆధ్వర్యంలో గిరిజన వికాస కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులకు అవసరమైన ఆధార్ సేవలు, వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అర్హులైన యువతను గుర్తించి నైపుణ్య శిక్షణ కొరకు ఎంపిక చేయడం, సమగ్ర సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి అవసరమైన అంశాలను గుర్తించడం జరిగింది. అలాగే ఎన్టీఆర్ వైద్యసేవా కార్డుల కొరకు అర్హులైన వారిని గుర్తించడం, ఉపాధి హామీ కార్డులు లేని వారికి కొత్తగా కార్డులు అందజేయడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు. తహశీల్దార్ ప్రసన్నకుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సర్పంచ్ చిన్నబుడ్డమ్మ శామప్ప, మండల ఉపాధ్యక్షులు డి.రూపజైకుమార్, వైద్యాధికారి డాక్టర్ షాలిని పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలంలోని మాధవరం పంచాయతీ పరిధిలో గల స్వస్తిక్ నగర్ ఎస్టీ కాలనీలో గిరిజన వికాసం కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు విజయవంతంగా నిర్వహించారు. ఈక్యాంపులో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.లావణ్య పాల్గొని అంగన్వాడి సేవల ప్రాముఖ్యత, పిల్లల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత, బాల్యవివాహాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి బాల్యవివాహాల నివారణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, డాక్టర్ మోహన్ వెళ్ళు, డాక్టర్ టి.ప్రియాంక, మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, మాజీ అధ్యక్షులు గాలి దిలీప్, క్లస్టర్ కన్వీనర్ ప్రవీణ్ నాయుడు, అంగన్వాడి వర్కర్ అరుణ పాల్గొన్నారు.

కార్వేటినగరం: ఎస్టి కుటుంబాల ఆరోగ్య శ్రేయ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో టి.చంద్రమౌళి, తహశీల్దార్ నాగరాజు అన్నారు. మంగళవారం కేపీ అగ్రహారం పంచాయతీ పరిధిలోని జాండ్లపేట ఎస్టి కాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వం ఎస్టి కుటుంబాల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని ఎస్టీ కుటుంబాలకి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జాండ్లపేట ఎస్టీ కాలనీలో ఎంపీడీవొ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ఎస్టీ సామాజిక వర్గం అనారోగ్యం గురికాకుండా మారు మూల ప్రాంతంలో ఉన్న జాండ్ల పేట ఎస్టీ కాలనీని ఎంచుకోవడం జరిగిందన్నారు. అనంతరం వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల నుంచి వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూడీ ఎంపీడీవొ మధుసూధన్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ భువనేశ్వరి, ఐసీడీఎస్ పర్యవేక్షకులు రోజారమణి, వీఆర్వో భరత్సాయి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ కడపల్లి ఎస్టీ కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం, పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక తహశీల్దార్ హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాయలపేట వైద్యబృందం ఎస్టికాలనీ వాసులకు వైద్యపరీక్షలు చేసి మాత్రలు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. అంగన్వాడీల ద్వారా పౌష్టికాహార వస్తువులను స్టాల్స్ నిర్వహించి అవగాహన కల్పించారు. సర్పంచ్, కుమారమ్మ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు మురహరి రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, సింగల్ విండో డైరెక్టర్ వెంకటరమణ, ఏపీవో మురుగేష్ పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలం పెద్ద గొట్టిగల్లు గ్రామపంచాయతీలో ఉండు ఎస్టీ కాలనీలో మంగళవారం మెడికల్ కాంపు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్ల రామచంద్రారెడ్డి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు శ్మశాన వాటికి ఏర్పాటు చేయాలని, తాగునీ పైపు లైన్లు వేయించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరడంతో సంబంధిత అధికారులు, సచివాలయం సిబ్బందితో కలిసి త్రపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను చట్టబద్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. తహసీల్దారు కిరణ్ కుమార్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, ఎస్సై మధుసూదన్, వీఆర్వో సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి వెంకట నిఖిల్ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: ఎస్టీలు అభివృద్ధి చెందటమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ఎంపీడీవో మురుగేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తూగుండ్రం పంచాయతీ దాసరపల్లి ఎస్టీకాలనీలో గిరిజన వికాసం కార్యక్రమంలో భాగంగా ఎస్టీ కాలనీలో ఆయన కాలనీవాసులను అభివృద్ధి కావలసిన అన్ని వసతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్సీసెల్ అధికారి, జిల్లా ఇమ్యూని జేషన్ అధికారి హనుమంతరావు పాల్గొన్నారు. డాక్టర్లు ప్రవీణ్, మౌనిక, వెటర్నరీ డాక్టర్ శ్రీనాథ్, స్థానిక సర్పంచ్ శ్రీ బాబు, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ పాల్గొన్నారు.

యాదమరి: మండల పరిధిలోని కీనాటంపల్లి షికారి కాలనీలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ దివ్య, పిహెచ్ఎన్ నిర్మలమ్మా, సూపర్‌వైజర్ సెల్వరాణి, సౌందర్య ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు సరస్వతి, సరిత పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION),CHITTOOR
I.A.No. 820 OF 2025
O.S.No. OF 2025

Between:-
1. Guttalalo Velasi Vunna Muthumari Amman Devalayam Committee, Gatralamitta represented by its President Y.Mani & 2 others
...Petitioners/Plaintiffs

And :-
Hari & 5 other ...Respondents/Defendants

PUBLIC NOTICE

The above representative suit is filed by villagers of Gataralamitta, Gudipala Mandal, Chittoor District represented by K.Vijaya Kumar and Mahalingam and 1st plaintiff is posted to **05-01-2026** for notice to general public for grant of permanent injunction in respect of property of Guttalalo Velasi Unna Muthumari Amman Devasthnam in favour of plaintiffs. Any objection from anybody from the public in respect of the above said temple property can appear in the above court at **10.30 a.m. on 05-01-2026** either by person or by Advocate and to file their objection if any in the above case.

TEMPLE PROPERTY SCHEDULE

Chittoor District – Chittoor Sub District – Gudipala Mandal – Nangamangalam Village Accounts – property situated at Gatralamitta in Sy.No.9/1D an extent of Ac.0.20 cents in which Muthumari Amman Temple constructed and Annadana Sathram is existed situated within the following boundaries:-
East : Land in Sy.No.9/1, West : Land in Sy.No.9, North : Land in Sy.No.9/1, South : Chennai to Bangalore NH-4 Road

Sd/- C.HARIKRISHNA
Advocate for Petitioner/Plaintiff
Place: Chittoor, Date: 30-12-.2025